ఖాళీ జాగా.. వేసేయ్ పాగా..!

గండిమైసమ్మ-దుండిగల్ మండలంలో భూముల ధరలకు రెక్కలు.. కబ్జాదారుల కన్ను

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- గంటల వ్యవధిలోనే ఇంటి నంబర్, కరెంట్ మీటరు
- అప్పుడప్పుడు కూల్చివేతలతో మమ అనిపిస్తున్న అధికారులు


చర్బిగాగిల్లాపూర్‌లోని శ్మశానవాటికకు పక్కనే చదును చేసిన దృశ్యం

దుండిగల్:

గండిమైసమ్మ-దుండిగల్ మండలంలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు అడపా దడపా అక్రమ నిర్మాణాలను కూల్చి వేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై 'సాక్షి' కథనం..

శరవేగంగా అభివృద్ధి

మండలపరిధిలోని మల్లంపేట, భౌరంపేట, దుండిగల్, డిపోచంపల్లి, గాగిల్లాపూర్, బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లి ఒకప్పుడు గ్రామాలుగా ఉండేవి. పట్టణీకరణ నేపథ్యంలో 2019లో మున్సిపాలిటీలుగా ఏర్పడ్డాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో ఇక్కడి వ్యవసాయ భూముల్లో ప్రస్తుతం భారీ బహుళ అంతస్తులు, వెంచర్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్లు వెలిశాయి.

భూముల ధరలకు రెక్కలు..

ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రియల్ ఎస్టేట్ రంగంతో గతంలో వందల్లో ఉన్న గజం విలువ ప్రస్తుతం లక్షల్లో పలుకుతున్నది. ప్రాంతాన్ని బట్టి ఇక్కడ ఒక్కో ఎకరా రూ.5 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

ప్రభుత్వ స్థలాలపై కన్ను..

భూముల ధరలు కోట్లకు చేరడంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని విలువైన భూములను కబ్జా చేస్తున్నారు. 60, 80 గజాలుగా ప్లాట్లను విభజించి వాటిని విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం..

సర్వే నంబర్ 214, 120 ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను పంపించి కూల్చివేయిస్తున్నాం. మల్లంపేటలో 3, 4 రోజుల క్రితమే కూల్చివేశాం. కబ్జాదారులపై కేసులు సైతం నమోదు చేసి ప్రభుత్వ స్థలాలను పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. – సయ్యద్ మతీన్, గండిమైసమ్మ-దుండిగల్ మండల తహసీల్దార్

గంటల వ్యవధిలోనే ఇంటి నంబర్, కరెంట్ మీటరు..

కబ్జాదారులకు అధికారులు సహకరిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రికి రాత్రే నిర్మించిన అక్రమ నిర్మాణాలకు ఉదయం వరకే ఇంటి నంబర్, కరెంటు మీటర్లు వచ్చేస్తున్నాయి. సామాన్యులు కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగినా కానీ పనులు ఇక్కడి కబ్జాదారులకు మాత్రం గంటల వ్యవధిలోనే అనుమతులు రావడం గమనార్హం.

కూల్చివేతలతో మమ..

స్థానికులు, ప్రతిపక్ష నేతలు ఫిర్యాదులు చేస్తే.. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు మాత్రం అధికారులు హడావిడి చేస్తారు. వెంటనే సదరు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తారు. తిరిగి మళ్లీ సదరు కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టినా చూసి చూడనట్లు వ్యవహరిస్తారు.

మచ్చుకు కొన్ని..

- డీపోచంపల్లి సర్వే నంబర్ 120లో సుమారు 100 ఎకరాలకు పైగానే ప్రభుత్వ స్థలం ఉండేది. ప్రస్తుతం ఇక్కడే మండల రెవెన్యూ, మున్సిపల్, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. వీటికి కూత వేటు దూరంలోని 120లో 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ఇక్కడా ఏకంగా 10కి పైగా కాలనీలు, బస్తీలు ఏర్పడ్డాయి.
- చర్చిగాగిల్లాపూర్ సర్వే నంబర్ 214లోని దాదాపు 40 ఎకరాలకు పైగా కబ్జాకు గురై పలు కాలనీలు వెలిశాయి.
- మల్లంపేటలోని సర్వే నంబర్ 170లో ఓ వ్యక్తి ఆరు ఎకరాలకు పైగా రైతుల నుంచి అసైన్డ్ స్థలాన్ని కొనుగోలు చేసి ఏకంగా 80కి పైగానే గదులు నిర్మించాడు.
- చర్చిగాగిల్లాపూర్‌లో శ్మశానవాటికకు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా 2 వేల గజాల్లో నిర్మాణాలు చేపడుతున్నారు.
- భౌరంపేటలోని సర్వే నంబర్ 472లో మొత్తం 31.34 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా అప్పట్లో 10 ఎకరాలను సబ్ స్టేషన్‌కు, ఏడు ఎకరాలను దిల్ సంస్థకు కేటాయించారు. మిగిలిన స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది.
- భౌరంపేట సర్వే నంబర్ 166/9లో 4.38 ఎకరాలకు ఎన్‌ఓసీ ఉందంటూ ఓ వ్యక్తి 160/1, 166/7, 166/8లో ఫెన్సింగ్, గేటు నిర్మించాడు. స్థానిక నేతల ఫిర్యాదుతో అధికారులు వాటిని కూల్చివేశారు.
- మల్లంపేటలోని సర్వే నంబర్ 170లో ఓ బడా నిర్మాణ సంస్థ ప్రభుత్వ భూమిలో విల్లాలు నిర్మించేందుకు యత్నించగా అధికారులు నిర్మాణ దశలోనే కూల్చివేశారు.
- ప్రస్తుతం మల్లంపేట, సర్వే నంబర్ 120, 214లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సర్కారు భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


డీపోచంపల్లి సర్వే నంబర్ 120లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం..


120లో ఇటీవల అధికారులు కూల్చివేసిన నిర్మాణం..(ఫైల్)


మల్లంపేట సర్వే నంబర్ 170లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

గౌరీ పౌర్ణమి పూజలు



మూసాపేట: మూసాపేటలో గురువారం పౌర్ణమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళలు గౌరీ పౌర్ణమి పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి వలస వచ్చి మూసాపేటలో ఎక్కువగా ఆ జిల్లా ప్రజలు నివసిస్తుంటారు. దసరా తరువాత వచ్చే పౌర్ణమికి వాళ్ల సంప్రదాయంగా గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు ఉపవాసం ఉండి కొత్త పంట అమ్మవారికి సమర్పించారు. అనంతరం పూజలు చేసి వాయినాలు తీసుకుంటారు. ఉలాల అంటూ మహిళలు అందరు ఒక్కసారిగా అరుస్తారు. అలా అరవడంతో అమ్మవారికి పూజ చేశామని చెప్పటం అని మహిళలు తెలిపారు.

సీఎంపై విమర్శలు మానుకోవాలి


సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చౌకబారు విమర్శలు మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నుంచి వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతల స్వీకరణ


గిరిధర్

మూసాపేట: మూసాపేట గూడ్స్ షెడ్‌రోడ్డులోని కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం నూతన సబ్ రిజిస్ట్రార్‌గా ఏ. గిరిధర్ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లా నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై కూకట్‌పల్లికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సురేందర్ ఎంవీపీ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న జిల్లా గణేష్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎల్లమ్మ బండ, దత్తాత్రేయ కాలనీలోని శ్రీ నాగ లింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, స్థల సేకరణలో భాగంగా రూ.50 వేలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్ నేత గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, అరుణ్, నాయకులు పి.మహేష్, వెంకటకృష్ణ, సుధాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

9.5 సీటీసీతో ఇన్ఫోసిస్‌లో ఆరుగురికి ఉద్యోగం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్టీయూ పరిధిలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సంవత్సరానికి రూ.9.5 లక్షల ప్యాకేజీతో ఆరుగురు విద్యార్థులు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం పొందినట్లు జేఎన్టీయూ అధికారులు గురువారం వెల్లడించారు. బీటెక్ నుంచి 234 మంది, ఎంటెక్, ఎంసీఏ నుంచి 249 మంది దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూకి హాజరయ్యారు. బీటెక్ నుంచి ఐదుగురు, ఎంసీఏ నుంచి ఒకరు ఎంపికైనట్లు పేర్కొన్నారు. సీఎస్‌ఈ రెగ్యులర్‌కు చెందిన పగడాల సునీతారెడ్డి, సాయి హేమంత్ నారాయణ్, గ్రీష్మ సప్పిడి, హారిక కేశరాజు, సీఎస్‌ఈ–ఐడీపీకి చెందిన స్ఫూర్తి బలే, ఎంసీఏ విద్యార్థిని ఉమాదేవి ఇన్ఫోసిస్‌లో 9.5 సీటీసీని సాధించారు.

కమిటీహాల్‌కు మరమ్మతులు చేపట్టాలి


అధికారులకు సూచనలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: పీవీ ఎన్‌క్లేవ్‌లో ఉన్న కమిటీ హాల్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ జీహెచ్‌ఎంసీ ఇంజినీర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిటీ హాల్ పాత భవనం కావడంతో మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కమిటీ హాల్ ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఏఈ ఉషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కు సూచించారు. పచ్చదనం ఉడేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నారాయణరావు, వేణుగోపాల్, సుధాకర్, విజయకుమార్, మల్లేష్‌యాదవ్, చందుయాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే


అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ తదితరులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మూసాపేట: భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌తో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, మల్లికార్జున స్వామి కల్యాణం, అన్న సమారాధన, సాయంత్రం పార్వతీ కల్యాణం, బుర్రకథ నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గౌసుద్దీన్, రాజు, వేణు, యాదగిరి, రాము, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మూసాపేట: మూసాపేట్‌లోని పాండురంగ స్వామి వారికి గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరే రామ్ సప్తాహ అనే పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయని, 9 రోజుల పాటు పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, గౌసుద్దీన్, ఉమాకాంత్, విఠల్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్, శేరి సతీష్ రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డితో కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని రంగ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తమ్మినేని ప్రవీణ్‌కుమార్, ఫణీంద్రకుమార్, పొడుగు అప్పారావు, వాల్మీకి అసోసియేషన్ సభ్యులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.


కేపీహెచ్‌బీ 3వ ఫేజ్‌లోని పోచమ్మ దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములు అన్నప్రసాదాన్ని తీసుకువెళ్లే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, అయ్యప్ప స్వాములు. – కేపీహెచ్‌బీకాలనీ

గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

కేపీహెచ్‌బీకాలనీ: గంజాయి సేవించడంతోపాటు విక్రయాలకు పాల్పడుతున్న నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసుల సహాయంతో కేపీహెచ్‌బీ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, కనక దుర్గ ఆలయం సమీపంలో మణికంఠ పీజీ హాస్టల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో బాలానగర్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు, కేపీహెచ్‌బీ పోలీసులతో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా 106 నంబర్ గదిలో గంజాయి సేవిస్తున్న సాయిగోపి విహార్, నగర్ వంశీలను అదుపులోకి తీసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేసిన తోరటి రాజేష్, తనిగిల రమేష్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 1600 గ్రాములు గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు మహిళలకు జాబ్‌మేళా

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్‌లో శుక్రవారం మహిళలకు నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మకుమారి, నిర్మాణ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్హత కలిగిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ ఐటీ కంపెనీలతో పాటు ఉత్పాదక రంగం, రిటైల్, ఫార్మ, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, బీపీఓ రంగాల నుంచి రిక్రూట్‌మెంట్ చేయనున్నామని తెలిపారు. అర్హత కలిగిన మహిళలకు స్పాట్ ఆఫర్లు అందజేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల లోగా గాయత్రినగర్, హరిహర క్షేత్రం దేవస్థానం సమీపంలో ప్లాట్ నెంబర్ 42లో హాజరు కావాలని కోరారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9154145734 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో జిల్లా స్థాయి యోగా సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నారు. విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 నుంచి 10 గంటలకు జేఎన్‌టీయూ గ్రౌండ్స్‌లో ఈ యోగా పోటీలు ఉంటాయని విశ్వ మానవతా సంస్థ వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాస చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఉత్తమ సాధకులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లో పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ధ్యానం, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసంపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కేపీహెచ్‌బీకాలనీ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు ఫీజు కట్టలేక ఖాళీ సమయంలో పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారన్నారు. సమావేశంలో శివకృష్ణ, అనీష్‌కుమార్, అర్జున్‌గౌడ్, చంద్రశేఖర్, సాయికుమార్ రాథోడ్, బ్రహ్మంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగులు వాడాలి


తహసీల్దార్ రహమాన్‌కు సంచులను అందజేస్తున్న లయన్ కోటిరెడ్డి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులను, జ్యూట్ బ్యాగులను వినియోగించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రహమాన్‌ను కలిసి 100 సంచులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి మండల కార్యాలయంతో పాటు జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఉన్న డివిజన్‌లలో దశల వారీగా ప్లాస్టిక్ నియంత్రణ కోసం విస్తృత ప్రచారంతో పాటు జ్యూట్ సంచులను పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ జన్మదినం, ఇతర శుభకార్యాల్లో కూడా ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. తహసీల్దార్ రహమాన్ మాట్లాడుతూ.. మనం నిత్యం వాడే కూరగాయలు, నిత్యావసర వస్తువుల కొనుగోళ్లలో ప్లాస్టిక్ కవర్లను నియంత్రించి గుడ్డ, జ్యూట్ బ్యాగులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో లియో అన్నెం తనూజ్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశమైన కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. గురువారం వార్డు కార్యాలయంలో వివిధ కాలనీ, బస్తీల మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి బస్తీ, కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి కానీ, సంబంధిత అధికారుల దృష్టికి కానీ తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన కర్తవ్యమని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారీగా ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో షమా, సత్తమ్మ, లక్ష్మి, పర్వీన్ సుల్తానా, రేణుక, అమ్ములు, రాజేశ్వరి, సైదమ్మ పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. రూ. 2.74 కోట్ల అంచనా వ్యయంతో చెరువులో మురుగునీరు కలవకుండా చేపడుతున్న నీటి మళ్లింపు పైపులైన్ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులోని నీరు కలుషితం కాకుండా చేపడుతున్న డ్రైనేజీ వ్యవస్థ మళ్లింపు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. చుట్టుపక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చెరువు పరిసరాలను పూర్తి స్థాయిలో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్, అలుగు నిర్మాణం చేపడుతామన్నారు. యూజీడీ మళ్లింపు పైపులైన్ నిర్మాణ పనుల గురించి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎర్రగడ్డ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీకి చెందిన సాయినాథ్‌కు రూ.18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గంగాధర్, అనిల్ రెడ్డి, పోతుల రాజేందర్, కాశీనాథ్ యాదవ్, క్రాంతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సుజిత్ మోహన్‌ను అభినందించిన ఎమ్మెల్యే


సుజిత్‌మోహన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ కాలనీకి చెందిన సుజిత్ మోహన్‌కు ఇటీవల నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, డాక్టరేట్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ వంటి అవార్డులు రావడంతో ఎమ్మెల్యే గాంధీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఏదో ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లల అభిరుచులకు తగ్గట్టు శిక్షణ ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, ఎల్లం నాయుడు, సతీష్‌గుప్తా, సునీల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.